
గవర్నమెంటు కథలు నెం. 7

# "ది జోక్"

—వీరభద్రరావ్ పమ్మి



నాకు సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువని నా మిత్రులందరూ అంటూ వుంటారు. హాస్యంగా మాట్లాడేవారన్నా, హాస్య రచనలన్నా, ముఖ్యంగా హాస్యమంటే నాకు చాలా ఇష్టం. జోక్స్‌ని బాగా ఎంజాయ్ చేస్తానని నా సర్కిల్‌లో నాకు మంచి పేరుంది.

"జోకు లమ్ముకుని బతికెయ్యగలవురా!" అని మా వదిన, "జోకులంటే తిండీ, పెళ్ళాం కూడా అక్ఖర్లే"దని మా ఆవిడ అంటూంటారు.


* * *

రాత్రి పదకొండు గంటలకు అతికష్టం మీద కొవ్వూరులో బస్సెక్కాను. నేను జనాన్ని తోసుకుంటూ లోపలి కెక్కితే వెంకయ్య మామయ్య కిటికీలోంచి సూట్ కేస్ అందించాడు. అప్పటికే బస్సులో సీట్లన్నీ నిండిపోయాయి. అదృష్టం కొద్దీ బస్సులో ఆఖర్న ఆరుగురు కూర్చునే సీట్లో మధ్యలో జాగా దొరికింది.

బస్సు మొత్తంలో అసౌకర్యంగా ఉండే సీటదే. అందులో కూర్చున్న మనుషుల్ని బస్సు కుదుపుకి పైకి ఎత్తేస్తుంది. పైగా

నాది అందులో మధ్యసీటు— పట్టుకోడానికి ఏ ఆధారమూ ఉండదు కూడా. బస్సు గతుకుల్లో గోతుల్లో పడినప్పుడల్లా నేను పైకెగిరిపోతున్నాను.

బస్సు ఏదో ఊళ్ళో ఆగింది. నా పక్కన కూర్చున్నతను దిగిపోయాడు. ఇక అక్కణ్ణుంచి ఏజెన్సీ ప్రాంతం ప్రారంభమౌతుంది. ఆ ఊళ్ళో ఆవేళ సంత జరిగిందట. బుట్టలు, తేనె, తాళ్ళు, చింతపండు వగైరా అమ్ముకోడానికి, తమకి వాడానిక్కావల్సిన సరుకులు కొనుక్కోడానికి కోయ జనం విపరీతంగా వస్తారట. అదే ఆఖరి బస్సు. బస్సెక్కడానికి చాలామంది ప్రయత్నిస్తున్నారు.




కండక్టర్ అందర్నీ అదిలిస్తూ, కేకలేస్తూ ఒక్కో టికెట్‌కి కాస్తో కూస్తో ఎక్కువ తీసుకుంటూ జనాన్ని ఎక్కించుకుంటున్నాడు. చివరికి మామిడిపళ్ళని కాపు పెట్టడానికి కూరినట్టు కూరాడు.

ఖాళీ అయిన నా పక్క సీట్లో ఓ కోయ యువతి వచ్చి కూర్చుంది. ఆమెకు పాతికేళ్ళ వయస్సుంటుంది. కాయకష్టం చేసినందువల్లనుకుంటాను— మనిషి కాస్త దృఢంగా ఉంది. ఆమె చేతిలో బక్కపలచగా, నల్లగా ఉన్న రెండేళ్ళ కుర్రాడున్నాడు. వాడికి ఒంట్లో ఎక్కడా సత్తువ లేదు. కాస్త పుష్టిగా ఉన్న ఎలక పిల్లలా వున్నాడు. శాపవశాత్తు

ఈ భూమ్మీద ముఖ్యంగా ఈ దేశంలో జన్మించినట్టున్నాడు.

బస్సులో గాలి ఆడటం లేదు. వేసవికాలం మూలంగా చెమట పోసేసి ఊపిరాట్టంలేదు. అందరూ ఇళ్ళకు తొందర తొందరగా వెళ్ళి పోవాలని తాపత్రయ పడేవాళ్ళే.

నా పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. వారం రోజులుగా నాటకం ప్రాక్టీస్లు చూడ్డానికి హైదరాబాదులో బయల్దేరి విశాఖపట్నం వరకు తిరిగాను. కంటినిండా నిద్ర పోయి చాలా రోజులయ్యింది. మర్నాడు పోలవరంలో నాటకం ప్రాక్టీస్ చూడాలి.

బస్సు బయల్దేరాక కాస్త గాలి తగుల్తోంది. చల్లగాలికి నిద్ర ముంచుకొచ్చేస్తోంది. నిద్రపోనూ లేను, మెలకువగా ఉండనూలేను. సీటు మధ్యలో కూర్చున్నందు వల్ల పట్టుకునేందుకు ఆధారం లేదేమో- ఎక్కడ సీట్లోంచి కింద పడిపోతానో అని ఓ మూల భయం. నిద్రలో తూలి పక్కని కూర్చున్న ఆడమనిషి మీద పడి పోతున్నాను. మెలకువ వచ్చేసి మళ్ళీ సర్దుకుని కూర్చుంటున్నాను.

ఏదో ఊరువచ్చింది. పెద్ద కుదుపుతో బస్సు ఆగింది. దీపాలు వెలిగాయి. ఆ కుదుపుకి నాకు మెలకువ వచ్చింది. ఆమె మీదకు ఒరిగి ఉన్నానేమో-నా కుడిచెయ్యి ఆమె రొమ్ములమీద వుంది. సిగ్గు పడ్డాను. చటుక్కున చెయ్యి తీసుకున్నాను. ఆమె నన్ను తప్పుగా అర్థంచేసుకుందేమోనని భయపడ్డాను. ఆమె అల్లరి చేస్తుందేమోనని హడలిపోయాను.

ఆమె ఓ సారి నా కళ్ళల్లోకి చూసి ఎటో చూస్తుండి పోయింది.

మళ్ళీ బస్సు బైల్దేరింది. దీపాలు ఆరిపోయాయి. అంతా గాఢ సుషుప్తిలో ఉన్నారు. నా కుడి పక్కన కూర్చున్నతను నా మీదికి ఒరిగి నిద్రపోతున్నాడు. ఏమైనా మెలకువగా ఉండాలని ఇందాకటి అనుభవంతో నిశ్చయించుకున్నాను. సిగరెట్ వెలిగించాను.

"కుద్రాడికి సందేలనుంచి జరం బాబయ్యా! ఒల్లు కాలిపోతోంది. వచ్చే ఊళ్ళో దర్మాసుపత్రి వుంది. అక్కడికి తీసికెడుతున్నాను. నాలుగు రూపాయిలిస్తే కాని ఆ డాట్రుబాబు పిల్లోణ్ణి సూడ్డు సరికదా—అసలు మనం సెప్పేది ఇనిపించుకోడు—నా దగ్గర మూడే ఉన్నాయ్. ఇంటికి తిరిగి నడిచేనా ఎల్తాను. కాని మూడు రూపాయలకాయన మందివ్వడు."

ఇదంతా ఆమె నా కెందుకు చెప్తోందో అర్థంకాలేదు. బహుశా డబ్బులడుగుతుందేమో? - అందుకే ఈ ప్లాన్.... అనుకున్నాను.

"ఓ రూపాయిచ్చి మీ పని కానిచ్చుకోండి."

ఆమె మాటలు నా కర్థంకాలేదు.

"సీకటేగా-ఎవళ్ళూ సూడరు."

ఎవరో చెళ్ళున కమ్చీతో వీపు మీద కొట్టినట్టనిపించింది.

ఇందాక మెలకువవచ్చేసరికి నా చేయి.... ఆలోచించలేకపోయాను.

నా గుండెల్నెవరో పిండుతున్నట్టనిపించింది.

ఆమె దిగాల్సిన ఊరు రానే వచ్చింది. పర్సులోంచి ఐదు కాయితం తీసి ఆమె చేతిలో పెట్టాను.

మొదట ఆశ్చర్యంగా చూసింది.

"దర్మ పెబువులు-మీ బిడ్డలు సల్లగా వుండాలి."

పీక నులిమిన కోడిపిల్లలా వున్న పిల్లాణ్ణి తీసుకుని దిగిపోయింది.

* * *

"గిరిజన సంక్షేమానికి ప్రభుత్వంచే మరోపదికోట్ల మంజూరు."

మర్నాడుదయపు న్యూస్‌పేపర్లో మెయిన్ హెడ్డింగ్.

"గిరిజనుల, వెనుకబడిన వర్గాల ఆరోగ్య పథకాలు సక్రమంగా సాగుతున్నాయని మంత్రిగారు వక్కాణించారు."—రేడియోలో వార్త.

ఆ జోక్‌లకు ఆ వేళ పొట్ట పగిలేటట్టు నవ్వుకున్నాను. ఆ రోజు నా కసలు ఆకలెయ్యలేదు. *

---

# విజయ
# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ" |
| అర్థసంవత్సర చందా | 18 రూ" |
| విడి ప్రతి | 3 రూ" |